క్లుప్తంగా

25లోపు ఈక్రాప్ నమోదు చేయించుకోండి



బసాపురం సమీపంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కుందుర్పి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 25 లోపు ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ విజయ్‌కుమార్, ఏఈఓ కులశేఖర్‌రెడ్డి సూచించారు.గురువారం జంబుగుంపల, కుందుర్పి, బసాపురం రెవెన్యూ గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని వారు పర్యవేక్షించారు. మండలంలోని 10 రెవెన్యూ గ్రామాల్లో 80 శాతం వరకూ ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన రైతులు ఆయా గ్రామాల ఎంపీఈఓలను సంప్రదించి 25వ తేదీ లోపు ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సైన్స్ సంబరాలు



జేవీవీ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం నుంచి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు చిత్తప్ప తెలిపారు. కళ్యాణదుర్గంలోని గోల్డెన్ బెల్స్ హైస్కూల్లో గురువారం కుందుర్పి ఎంఈఓ తిప్పేస్వామితో కలిసి సైన్స్ సంబరాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న పాఠశాల స్థాయిలో, నవంబర్ 1న తాలూకా స్థాయి, 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12,13,14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో సైన్స్ సంబరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ జిన్స్ జేవియర్, కోశాధికారి జాన్ పీటర్, జేవీవీ నాయకులు నాగరాజు, రాజన్న, సోమశేఖర్, తిమ్మారెడ్డి, మాన్తీష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ, ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: టీబీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం -3లో గురువారం ఏపీ ఎయిడ్స్ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ సంస్థ, రిడ్స్ సంస్థల ఆధ్వర్యంలో సమగ్ర ఐఈసీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, డాక్టర్ అమృత వర్షిణితో కలిసి సీడీపీఓ మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం ఏఆర్‌టీ మందులు, ఏపీ సాక్స్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1097 గురించి తెలిపారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో రిడ్స్ సిబ్బంది కిరణ్ కుమార్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల మీట్

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మెట్టును పరామర్శించిన నాయకులు



మెట్టును కలసిన వైఎస్సార్‌సీపీ నేతలు

కణేకల్లు: అనారోగ్యం కారణంగా చికిత్సపొంది బెంగళూరులోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకొంటున్న రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, రాష్ట్ర ఎస్ఈసీ సభ్యులు గౌని ఉపేంద్రరెడ్డి, రాయదుర్గం పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, కణేకల్లు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, రామాంజినేయులు, గోవర్ధన్ తదితరులు కలసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నిరీక్షణ...ప్రదక్షిణ

- నూతన పింఛన్ల కోసం అర్హుల ఎదురుచూపు
- 15 నెలలుగా ఓపెన్ కాని సైట్



ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యాలయం

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వితంతు, వృద్ధాప్య, దివ్యాంగ తదితర పింఛన్ల కోసం నూతనంగా దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు నిత్యం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ ఇంకా సైట్ ఓపెన్ అవ్వలేదని అధికారులు చెబుతుండటంతో నిరాశగా వెనుతిరుగుతున్నారు. గ్రామాల్లో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా ప్రభుత్వం అందించే పింఛన్లే ప్రధాన ఆధారం. గత ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ సొమ్మును ఠంఛన్‌గా అందజేసేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు ఉన్న పింఛన్లలోనే కోతలు విధిస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

గతంలో వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే లబ్ధిదారులను ఎంపిక చేసి కొత్తగా అర్హులైన వారికి పింఛన్లు అందజేసేవారు. మొదటి మూడేళ్ల పాటు ప్రతి మూడు నెలలకోసారి చొప్పున నూతన పింఛన్లు మంజూరు చేసేవారు. ఆ తర్వాత 2023, 2024 సంవత్సరాల్లో ప్రతి ఆరునెలలకు అర్హులైన వారు నష్టపోకుండా వలంటీర్ల ద్వారా ఎంపిక చేసి పింఛన్లు అందజేశారు. 2024 జనవరిలో చివరిగా నూతన పింఛన్లు మంజూరుచేశారు. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో నూతన పింఛన్లకు బ్రేక్ పడింది. ఆ తర్వాత 2024 ఏప్రిల్‌లో ఆగిపోయిన సైట్ నేటికి ఓపెన్ కావడం లేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక:

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబర్‌లో కొత్త జీవో తీసుకొచ్చింది. పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే మరుసటి నెల నుంచి భార్యకు పింఛన్ అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏడాదిగా నూతన పింఛన్లు రాకపోవడంతో ఉరవకొండ మండలంలో 60 ఏళ్లు నిండిన సుమారు 900 మంది లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదరుచూస్తున్నారు. 2024 డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి సంక్రాంతికి జన్మభూమి కార్యక్రమం నిర్వహించి నూతన పింఛన్లు అందజేస్తామని టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రకటనలు చేశారు. దీంతో సంక్రాంతికి కొత్త పింఛన్లు ఎదురుచూసిన లబ్ధిదారులకు ఎదరుచూపులే మిగిలాయి.

50 ఏళ్ల హామీ అమలుకు నోచుకునేదెప్పుడో?

ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అయితే అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా హామీ ఊసెత్తడం లేదు. దీంతో నియోజకవర్గంలో 15వేల మందికి పైగా 50 ఏళ్లు నిండిన వారు ప్రభుత్వ హామీ ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

50 ఏళ్లకే పింఛన్ అందజేయాలి



ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ అందించాలి. కూటమి ప్రభుత్వంలో చేతి వృత్తుల వారికి ఎటువంటి పథకాలు అందడం లేదు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ నెరవేర్చాలి.

– లలితమ్మ, సర్పంచ్, మేజర్ గ్రామ పంచాయతీ, ఉరవకొండ

అర్హులకు అందజేయాలి



అర్హులందరికి ప్రభుత్వం నూతన పింఛన్లు అందజేయాలి. చేతి వృత్తులు చేసుకొనే వెనుకబడిన 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు అందించాలి. ఆరునెలలకొకసారైన నూతన పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– వడ్డే ఆంజినేయులు, వడ్డెర సంఘం నేత, ఉరవకొండ

ఆదేశాలు వస్తే అందజేస్తాం



ప్రభుత్వ ఆదేశాలు రాగానే కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి వారికి అందజేస్తాం. భర్త చనిపోయిన వెంటనే ఆస్థానంలో భార్యకు పింఛన్ అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్ప పింఛన్లు మంజూరు చేసే వీలుండదు.

– రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

మొక్కుబడిగా ‘పోషణ మాసోత్సవం’



పైతోట అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మావతి

రాయదుర్గంటౌన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవం రాయదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మొక్కుబడి ముగిసింది. గత నెల 17న ప్రారంభం కాగా ఈ నెల 16వ వరకు జరిగింది. ప్రాజెక్ట్ పరిధిలోని రాయదుర్గం అర్బన్, రూరల్, గుమ్మఘట్ట, డీ.హీరేహాళ్ మండలాల్లో మొత్తం 185 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిన్నింటిలోనూ అంతంత మాత్రంగానే అవగాహన కార్యక్రమాలు జరిగాయి. గర్భిణుల ఆరోగ్య రక్షణ, రక్తహీనత నివారణ, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, పరిశుభ్రత వంటి పలు అంశాలపై అవగాహన కల్పించాల్సి ఉంది. బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యత, పౌష్టికాహారం లేకపోతే ఎదురయ్యే రుగ్మతలపై అవగాహన కల్పించాలి. కానీ పూర్తిస్థాయిలో అన్ని కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించలేదన్న విమర్శలున్నాయి. చివరిరోజైన గురువారం పట్టణంలోని పైతోటలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవ కార్యక్రమానికి సీడీపీఓ పద్మావతి హాజరై బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం



అప్పిలేపల్లిలో ఏర్పాటు చేసిన నూతన కమిటీ

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నూతనంగా ఎంపికైన ఎస్సీ సెల్ గ్రామ కమిటీలు కీలకం కావాలని కళ్యాణదుర్గం నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, మండల ఉపాధ్యక్షుడు భీమప్ప, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, సర్పంచులు అతావుల్లా, విజయ్ సూచించారు. గురువారం మండలంలోని ఎనుములదొడ్డి, అప్పిలేపల్లి గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నూతన కమిటీలను ఎంపిక చేశారు.ఎనుములదొడ్డి పంచాయతీ అధ్యక్షుడిగా చిన్నప్ప, కార్యదర్శిగా సురేష్, అప్పిలేపల్లి పంచాయతీ అధ్యక్షుడిగా తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శిగా మందలపల్లి రమేష్, కార్యదర్శిగా ఆంజనేయులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అన్వేష్, నాయకులు బొమ్మలింగ, దినేష్, తిప్పేస్వామి, ఐటీ విభాగం అధ్యక్షుడు మరిస్వామి, గ్రామ కమిటీ కన్వీనర్ సోము తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి సమాధి కడతాం



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్

ఉరవకొండ: రాష్ట్రంలో వైద్యవిద్యను ప్రైవేటీకరిస్తే కూటమి ప్రభుత్వానికి సమాధి కడతామని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డక్కా కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా ప్రథమ మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. రాష్ట్రంలో నకిలీ మద్యంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. విద్యాసంస్థలు, హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాల నేతలు వెళ్లకుండా తీసుకొచ్చిన జీవోను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల విద్యార్థి సంఘం నేతలు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆదినారాయణ

ఉరవకొండ: క్షయ నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేద్దామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వాణిజ్య విభాగం అధిపతి నీలి వెంకటేశులు అధ్వర్యంలో క్షయ నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మురికివాడల్లో నివసించే వారు ఎక్కువగా వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. వ్యాధి నిర్మూలనపై విద్యార్థులు ప్రజలను చైతన్యవంతులన్ని చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధాకర్, రామాంజనేయులు, గుప్తా, ప్రభాకర్, నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

దర్గా నిర్మాణానికి ఎమ్మెల్సీ తనయుడి విరాళం



దర్గా కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న నాయకులు

వజ్రకరూరు: చాబాల గ్రామంలో దర్గా వన్నూరు స్వామి దర్గా నిర్మాణానికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత వై.భీమిరెడ్డి రూ.50,555 విరాళాన్ని అందించారు. గురువారం సాయంత్రం దర్గాలో విరాళం మొత్తాన్ని భీమా యూత్ నాయకులు దర్గా కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు శివలింగప్ప, క్ొమ్మె కుళ్లాయప్ప, భీమా యూత్‌నాయకులు గురు, లేపాక్షి, కుళ్లాయిస్వామి, పూసల నరేష్, చెన్నప్ప, కర్రెప్ప, హరికృష్ణ, సుధాకర్, ప్రభాకర్, వన్నూరుస్వామి, వెంకటేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దర్గా ప్రారంభం

చాబాల గ్రామంలో నూతనంగా నిర్మించిన దర్గాహొన్నూరు స్వామి దర్గాను శుక్రవారం ప్రారంభించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. తెల్లవారుజామున 4:30 గంటలకు దర్గా ప్రవేశం, 6:45 నుంచి సర్వదర్శనం ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

సంక్షిప్త సమాచారం

జంక్ ఫుడ్ ఆరోగ్యానికి ప్రమాదకరం

కణేకల్లు: జంక్‌ఫుడ్ పిల్లల ఆరోగ్యానికి ప్రమాదకరమని సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంటలో గురువారం పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పౌష్టికాహారంపై ర్యాలీ నిర్వహించారు.

ఒత్తిడి లేకుండా చదవండి

శెట్టూరు: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. గురువారం మండలంలోని బచ్చేహళ్లి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల కార్యక్రమం పరిశీలించారు.

తాళ్లకెరలో చోరీ

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలోని ఆంజనేయులు ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు 5 తులాల బంగారం, రూ.30 వేల నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ముదిగల్లులో వాల్మీకి జయంతి

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు, మహిళలు కలశాలతో ఊరేగింపుగా వాల్మీకి విగ్రహం వద్దకు చేరుకుని పూజలు చేశారు. వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పలువురు వక్తలు సూచించారు. అనంతరం గ్రామంలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించి, అన్నదానం చేపట్టారు.

నేడు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని పశువైద్యశాలలో శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి వెంకటరెడ్డి తెలిపారు. ఎదకు రాని పశువులు, పలుమార్లు ఎదసూది వేసినప్పటికీ కట్టని పశువులు, గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న పశువులకు చికిత్స చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉచితంగా హార్మోన్, మినరల్ ఇంజక్షన్లు, అవసరమైన మందులను ఉచితంగా అందిమన్నారు.

నేల ఆరోగ్యంపై అవగాహన

శెట్టూరు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో నేల ఆరోగ్యం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం పాఠశాలలో విద్యార్థులతో కలిసి వ్యవసాయ శాఖ ఏడీ రోజా పుష్పలత, ఏఓ వసకి రాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనునయమ్మ, వ్యవసాయశాఖ అధికారులు ఉమామహేశ్వరి, మెహరున్నిస, శేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో పేదలకు అందని వైద్యం



మాట్లాడుతున్న రామప్పనాయక్

ఉరవకొండ: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామప్పనాయక్ విమర్శించారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో ఇటీవల ఆస్పత్రిలో ఐదేళ్ల చిన్నారి మృతి చెందారన్నారు. దీన్ని నిరూపించేందుకు ఆస్పత్రిలో సీసీకెమెరాలు లేవన్నారు. ఇప్పటికైనా మంత్రి కేశవ్ ఆసుపత్రిలో మౌలిక వసతులతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కుందుర్పి: మండలంలోని వెంకటంపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ కాలనీ వాసులు గురువారం ఎంపీడీఓ మాధవికి వినతి పత్రం అందజేశారు. పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమస్యను విన్నవించినా స్పందన లేదని హనుమంతరాయుడు, ఆంజనేయులు, మారెక్క, లక్ష్మీదేవి తదితరులు తెలిపారు. సమస్యను పరిష్కరించకపోతే మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

22 నుంచి క్రీడాకారుల ఎంపికకు పోటీలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఈనెల 22 నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, 17 విభాగాల్లో మండలస్థాయిలో వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-1 మహమ్మద్ ఇర్షాద్ తెలిపారు. గురువారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో పీఈటీలు, పీడీలతో సమావేశం నిర్వహించారు. మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు.

వయసుకు తగ్గ ఎత్తు ఉండాలి

కూడేరు: పిల్లలు వారి వయసుకు తగ్గ ఎత్తు, బరువుండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సురేఖ పేర్కొన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం శివరాంపేటలో చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన ఆహారంపై పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శ్యామల, పిల్లల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: పందికుంట గ్రామంలో గురువారం పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రబియా పోషకాహార ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సునిత, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మేం ఇచ్చేది ఇంతే..

- ఇష్టమైతే ఉండండి...లేదంటే వెళ్లిపోండి
- శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు కాంట్రాక్టర్ బెదిరింపులు



శ్రీరామిరెడ్డి పంపుహౌస్ వద్ద సమావేశమైన కార్మికులు

కళ్యాణదుర్గం: మేము...ఇచ్చేది ఇంతే జీతం...మీకు ఇష్టమైతే ఉండండి...లేదంటే వెళ్లిపోండంటూ కాంట్రాక్టర్ తమను బెదిరిస్తున్నారంటూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ఫేజ్-4 కింద కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో పనిచేస్తున్న కార్మికులు కళ్యాణదుర్గంలోని పంప్‌హౌస్ వద్ద సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ పథకం ప్రారంభం నుంచి చాలామంది కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. ఇప్పటికీ కార్మికులకు సుమారు మూడు నెలల వేతనం అందాల్సి వుందన్నారు. అయితే కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ గతంలో ఇస్తున్న వేతనం రూ.18,200 కు బదులుగా ఈపీఎఫ్, ఈఎస్ఐతో కలిసి రూ.11,200 ఇస్తామని చెప్పడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మేం ఇచ్చేది ఇంతే వేతనం.. మీకు...ఇష్టమైతే ఉండండి...కష్టమైతే వెళ్లిపోండంటూ హుకు జారీ చేసినట్లు ఆయన వాపోయారు. కేవలం అధికార దాహంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు అనుచరుడిగా ఉంటున్న భట్టువానిపల్లి పవన్ అనే వ్యక్తికి కాంట్రాక్ట్ ఏజెన్సీ సబ్ కాంట్రాక్టర్ ఇచ్చి కార్మికులపై ఉసిగొల్పుతున్నట్లు వాపోయారు. కాంట్రాక్టర్ బెదిరింపులు ఆపకపోతే ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. గతంలో కార్మికుల పక్షాన ఉంటానని చెప్పిన ఎమ్మెల్యే ఇలా తమ పొట్టకొట్టడం సరైంది కాదని పలువురు కార్మికులు వాపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు చొరవ చూపి కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్దకు చేరుకుని డీఈ అసిస్టెంట్ సాగర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, నరేష్, ఓబుళపతి, తిప్పేస్వామి, గంగాధర్, శెట్టూరు నరేష్, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ప్రధాన కూడలి వరకూ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ, ఆశావర్కర్లు మహంతమ్మ, ప్రేమక్క, రామలక్ష్మి, నరసమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

కళ్యాణదుర్గం: మండలంలోని పాపంపల్లి వద్ద గురువారం సాయంత్రం ఆటోను బైక్ ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కుందుర్పి మండలం బసాపురానికి చెందిన మల్లేశప్ప కళ్యాణదుర్గంలో పని ముగించుకుని బైకులో స్వగ్రామానికి వెళ్తున్నాడు. పాపంపల్లి వద్దకు రాగానే రోడ్డు పక్కన ఆపి ఉన్న ఆటోను ఢీ కొట్టాడు. ఘటనలో మల్లేశప్ప కాలుకు బలమైన గాయం తగిలింది. స్థానికులు అతడిని 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కొలిమివీధిలోని కళాశాల బీసీ సంక్షేమ వసతి గృహం వార్డెన్ నిర్లక్ష్య వైఖరి వీడాలంటూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాలు నిరసనకు దిగాయి. గురువారం సాయంత్రం హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ వార్డెన్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, భోజనం మెనూ చెత్త కుప్పల్లో పడేశాడన్నారు. విద్యార్థుల చేతనే హాస్టల్ గదుల శుభ్రం చేయిస్తున్నారని, వంట పనులు ఇతరాత్ర అన్ని పనులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వార్డెన్‌పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటు

- అనుమతులు రాకముందే షెడ్ల ఏర్పాటు



ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా షెడ్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బాణసంచా షెడ్లను ఏర్పాటు చేశారు. అధికారుల నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు రాకముందే వ్యాపారులు షెడ్లను ఏర్పాటు చేసుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఉన్న ఒకే ఒక మైదానంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుపై క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల ఏర్పాటుపై ‘సాక్షి’ ఫైర్ ఆఫీసర్ నాగభూషణం వివరణ కోరగా ఆర్డీఓ అనుమతులు పొందిన ఉత్తర్వులు గురువారం మధ్యాహ్నం అందాయని, వ్యాపారస్తులతో చలానాలు కట్టించుకుని ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉందన్నారు.